

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## – కస్తూరి మురళీకృష్ణ

**సుహానా సఫర్ ఔర్ యె మౌసం హసీన్**

**హమే డర్ హై హం ఖో న జాయే కహీ**

ప్రయాణం అనగానే గుర్తుకు వచ్చే పాట ఇది. ప్రయాణంలో అందమైన ప్రకృతి దృశ్యం కనబడి మనసు ఆనందమయం కాగానే గుర్తుకు వచ్చేపాట ఇది. 'మధుమతి' సినిమాలో దిలీప్‌కుమార్ పాత్రను పరిచయం చేసేపాట ఇది. ఇలా ప్రయాణిస్తూ పాడే పాటలను 'Travel songs' అంటారు. పాతకాలం సినిమాలలో ఇలాంటి పాటలు పలు రకాలుగా ఉపయోగపడేవి. పాత్రను పరిచయం చేసేవి. ప్రకృతిని, పరిసరాలను గమనించటం నేర్పేవి. సినిమా వ్యాపార విలువను పెంచేవి. ప్రజలకు అటు మంచి ఆలోచనలను ఇచ్చేవి. ఇటు సాహిత్య గంధం పూసేవి. ఈ రకంగా ఈ ప్రయాణపు పాటలు అత్యంత ప్రజాదరణ పొందేవి. ప్రయాణపు పాటలను అప్పుడప్పుడు తత్వాన్ని బోధించేందుకు వాడేవారు. ఒకో గేయ రచయిత తన సంస్కారాన్ని, వ్యక్తిత్వాన్ని అనుసరించి సినిమా సందర్భ పరిధిలో ఒదుగుతూ కూడా పాటకు ప్రత్యేకతను ఆపాదించేవాడు.

'మధుమతి' సినిమాలో ఈ పాట నాయకుడు ఉద్యోగానికి వెళ్తూ దారిలోని ప్రకృతిని చూసి పరవశిస్తూ పాడేపాట. పాటంతా ప్రకృతి వర్ణన అందంగా సాగుతుంది.

**యే కౌన్ హస్తాహై ఫులోమె ఛుప్ కర్**

**బహార్ బేచై హై జిస్‌కి ధున్ పర్**

**కహి గున్ గున్, కహి రున్‌ఝున్**

**కి జైసే నాచే జమీన్**

చాలా సరళమైన పదాలలో సుందరమైన ప్రకృతి దృశ్యాలను చిత్రిస్తున్నాడు కవి.

పూలలో దాగి ఎవరో నవ్వుతున్నారట. వసంతం ఎవరి సంగీతానికి, లయకు పిచ్చిదై ఆత్రంగా ఎదురు చూస్తుందో వారు పూలలో దాగి నవ్వుతున్నారన్నది అందమైన ఊహ. ఓ వైపు సీతాకోక చిలుకల పాటలట. మరోవైపు తుమ్మెదల ఝుంకారమట. ఇది భూమి, నేల నృత్యం చేస్తున్నట్టుందట. సీతాకోక చిలుకలు, తుమ్మెదలు ఎగుర్తుంటే, అందమైన పూల లతలు తలలూపుతూంటే, వాటిలో సుందరమైన ప్రేయసి వదనం ద్యోతకమవుతూంటే, ఆమె అందానికి ప్రకృతి పరవశిస్తూంటే ఇక ఆ ప్రయాణం ఎంత మధురం. అలాంటి ఆనందకరమూ, అందమైన ప్రయాణంలో మైమరచి వ్యక్తి తనని తాను మరచిపోవటంలో ఆశ్చర్యం ఏముంది? అందుకే 'సుహానా సఫర్ ' పాట అందమైన బాణీ , ఇంకా మధురమైన ముఖేష్ స్వరంతో వన్నెలు దిద్దుకున్నా, పాటలో పదాలవల్ల మరింతగా అలరిస్తుంది. ఇది శైలేంద్ర ప్రత్యేకత. అలతి అలతి పదాలతో అత్యంత సుందరమైన భావాలను పొదిగి మనసును ఆనందపుటలల శృంగం పై నర్తింపచేస్తాడు.

**యె గోరి నదియోంకా చల్‌నా ఉఛల్ కర్**

**కే జైసె అల్ హడ్ చలే పీ సె మిల్‌కర్**

**ప్యారె ప్యారె యే నజారే నిసార్‌హై హర్ కహి**

హిందీ సినీ గీతాలలో ఉర్దూ పదాలను అతి తక్కువగా వాడుతూ, సామాన్య ప్రజల భాషలోని సుందరమైన పదాలను ఏర్చి కూర్చి అందంగా భావాల మాలికలను అల్లిన కవి శైలేంద్ర. ఈ పాదంలో ఆయన వాడిన 'అల్ హడ్' అన్న పదాన్ని సినిమా పాటలలో అతి తక్కువగా వింటాం. కానీ ఆ పదం అక్కడ పడటం పాటకు ఎంతో అందాన్నిస్తుంది. 'గోరినది' అనటం ఎంతో సుందరంగా ఉండటమే కాదు పాట భావాన్ని లోతు చేస్తుంది. ఇక్కడ నదులు యువతుల్లాలేవు. నదులే యువతులు...అవి ప్రియుడిని కలిసి ఎగుర్తూ దూకుతొ ప్రవహిస్తున్నాయి.నదులు ఉరుకుల పరుగుల మీద ప్రవహిస్తూంటాయి. ఆ నదీ ప్రవాహం ఎలా ఉందంటే ఒక ముగ్ధ తన ప్రియుడిని కలసిన తరువాత మనసు ఆనందంతో గంతులు వేస్తూ పరుగులు పెడుతున్నట్టుందట. ఇది ఈ సినిమా పరిధిలో ఎంత గొప్పగా ఒదిగిందంటే, నాయిక పల్లెటూరి పిల్ల. నడవదు. పరుగులు పెడుతూంటుంది. నాయకుడిని కలసి వెళ్లేప్పుడు చరచరా కొండల దారులు దిగి వెళ్తూంటుంది. సినిమా చూసిన తరువాత ఈ పాట వింటే ఈ పాదం వచ్చినప్పుడు కళ్లముందు నాయిక చంచలమైన, చురుకైన పరుగులాంటి నడక కదులుతుంది. 'యెగోరి నదియోంక్ చల్‌నా ఉఛల్‌కర్, లె జైస్ అల్ హడ్ చలే పీ సె మిల్‌కర్ ' గుర్తుకు వస్తుంది.

ఇంతవరకూ ప్రకృతిని వర్ణించిన కవి, చివరి చరణంలో జరగబోయే కథను సూచనప్రాయంగా ప్రస్తావిస్తాడు.

**వో ఆస్మాన్ ఝుక్ రహాహై జమీన్ పర్**
**యే మిలన్ హం నే దేఖా యహీ పర్**
**మెరి దునియా, మెరి సప్నె**
**మిలేంగే షాయద్ యహీ!**

దూరంగా, ఆస్మాన్, అంటే ఆకాశం భూమి పైకి వంగిందంట. ఈ కలయికను అతడు ఇక్కడే చూశాడట. తన కలలు, కోరికలు అన్నీ తీరేది ఇక్కడేనేమో అంటున్నాడు.

మధుమతి జన్మజన్మల ప్రేమ కథ. ఒక అసంభవమైన కలయికను ప్రదర్శిస్తుంది. అందుకే ప్రతీకాత్మకంగా ఆకాశం, భూమి కలవటం ఇక్కడే చూస్తున్నాను అంటున్నాడు. నిజానికి కాస్త ఎత్తుకు వెళ్లి చూస్తే ఎక్కడయినా ఆకాశం భూమిపైకి వంగటం కనిపిస్తుంది. కానీ ఇక్కడే ఆ కలయికను చూస్తున్నానని అనటం, తన కలలు కోరికలు ఇక్కడే తీరతాయని అనటం పాట గాంభీర్యాన్ని సంతరించుకుంటుంది. కథ సారాన్ని రెండు ముక్కలలో చెప్పేస్తోంది. గమనిస్తే పాట చిత్రీకరణలో నాయకుడు శిఖరం పైన ఉంటాడు. అతడు ఆకాశం. నాయిక నాయకుడికి పరిచయం అయినప్పుడు లోయలో, ఎక్కడో ఉంటుంది. పొగమంచు పొరల మాటున. ఆమె భూమి. ఆకాశం, భూమి కలయిక ఇక్కడే జరుగుతుంది.

ఇది శైలేంద్ర ప్రత్యేకత. హిందీ సినీగేయ రచయితలందరిలోకీ కథా సారాన్ని పట్టుకుని రెండు ముక్కలలో ప్రదర్శించగల ఏకైక గేయరచయిత శైలేంద్ర. అందుకే అత్యధికమైన 'థీం సాంగ్స్' రాసిన ఘనత శైలేంద్రదే. అలాంటి కవి అంతకు ముందు లేదు. ఇకపై రాదు. మధుమతి సినిమాలో ఎన్నో అత్యద్భుతమైన పాటలున్నా ఈ పాట ప్రత్యేకంగా గుర్తుండిపోతుంది. కారణం పాటలోని ప్రకృతి వర్ణన అత్యంత సులభంగా ఉండటమే కాదు చివరి చరణం భవిష్యత్తును సూచించే రీతిలో మర్మంగా ఉండటం కూడా ఇలాంటి ప్రయాణం పాటనే గుల్జార్ రచించిన 'ముసా ఫెర్ హు యారో' గుల్జార్ రాసిన పాటలలో సులభ్భంగా బోధపడే పాటలలో ఇదొకటి.

**ముసాఫిర్ హూ యారో నఘర్ హై న ఠికానా**
**ముఝే చల్తే జానా హై**
**బస్ చల్తే జానా హై**

ఈ పాటకు అత్యద్భుతమైన బాణీని ఆర్డీబర్మన్ కూర్చాడు. కిషోర్ కుమార్ స్వరంలో పాట అందని ఆనందపుటెత్తులను అధిరోహిస్తుంది. భావం చాలా సులభం నేను బాటసారిని. ప్రయాణీవాసిని. ఇల్లూ వాకిలి లేదు. ముందుకు సాగటమే నా పని.

**ఏక్ రాహ రుక్ గయీ తో ఔర్ జుడ్ గయీ**

**మై ముడాతో సాథ్ సాథ్ రాహ ముడ్ గయీ**

**హవా కే పరోం పర్ మేరా ఆషియానా**

అత్యద్భుతమైన భావం. వ్యక్తిత్వ వికాస తరగతులలో వల్లె వేయాల్సిన పాఠం ఇది. ఒకదారి మూసుకుపోయిందని బాధపడాల్సిన అవసరంలేదు. మరో దారి దానికి వెన్నంటే ఉంటుంది. అంతేకాదు, మనం దారిని బట్టి నడవటం కాదు. మనం ఎటు నడిస్తే దారి అటు నడవాలి. మనం ఎటు తిరిగితే దారి అటు తిరగాలి. అన్నింటినీ విధికి వదిలేయటం మూర్ఖత్వం. మన అదృష్టాన్ని మన చేతుల్లోకి తీసుకోవాలి. మన అదృష్టాన్ని మనమే నిర్ణయించుకోవాలి. అంతే తప్ప, దారి మూసుకుపోయిందని బాధపడుతూ కూర్చుంటే లాభం లేదు. అనంతమైన విశ్వంలో అనంతమైన దారులు. ఇక చివరి పాదం చాలా చక్కనిది. బాణీలో అద్భుతంగా ఒదుగుతుంది. గాలి రెక్కలపై ఉందట అతని ఇల్లు. వహ్! అనిపిస్తుంది.

**దిన్ నే హాథ్ థాం కర్ ఇదర్ బిఠాలియా**

**రాత్ నే ఇషారోంపర్ ఉధర్ బులాలియా**

**సుబహ సే, షా సే మేరా దోస్తానా**

తన మన భేదం లేదు. సుఖం, దుఃఖం భావనలేదు. ఏది లభిస్తే దాన్ని సంతోషంగా స్వీకరించే స్థిత ప్రజ్ఞతను అతి సరళంగా, సులభంగా బోధిస్తున్నాడు గుల్జార్ ఈ పంక్తులలో.

ఉదయం చేయి పట్టుకుని ఇక్కడ కూర్చోబెట్టిందట. రాత్రి సౌంజ్ఞ చేసి అక్కడకు పిలిపించుకుందట. రాత్రి, పగళ్లతో నాకు స్నేహం అంటున్నాడు. అంటే వెలుతురు, చీకటుల నడుమ భేదభావంలేదు. పగలు, చీకటులు నడుమ తేడాలేదు. రెంటితో సమానమైన స్నేహం అంటే ఏది లభిస్తే దాన్ని స్వీకరిస్తున్నాడు. ఎవరు ప్రేమగా పలకరిస్తే వారివెంట వెళ్తున్నాడు.

ఇదే భావనను 'నౌదోగ్యారా' అనే సినిమాలో మజ్రూహ్ ఇలానే గొప్పగా చెప్పాడు. ఇక్కడ గుల్జార్ కాస్త మార్మికతను ప్రదర్శించాడు. రాత్రి పగలు అంటూ ప్రతీకలనుంచాడు. కానీ మజ్రూహ్కు అలాంటివేవీ లేవు. ఎంత సరళంగా ఎంత గొప్పగా చెప్పాలో అంత సూటిగా, స్పష్టంగా చెప్పాడు.

**హం హై రాహి ప్యార్ కా హంసె కుఛ్ నా బోలియే**

**జోభీ ప్యార్ సే మిలా హం ఉనీకె హోలియే**

ఈ 'హం హై రాహి ప్యార్ కా' అన్న పదబంధం చాలా ప్రాచుర్యం పొందింది. 'ప్రేమ పథికుడు' అన్నమాట. ఎవరు ప్రేమగా కలిస్తే వారి వాడయిపోతాడన్నమాట. ఎస్డీ బర్మన్ మధురమైన బాణీని కిషోర్ కుమార్ అద్భుతంగా పాడాడు. దేవ్ ఆనంద్ ఇమేజ్ని స్థిరపరచి ప్రేక్షకులను అత్యంత సమ్మోహన పరచే రీతిలో పాటను చిత్రీకరించాడు విజయ్ ఆనంద్.

అతడు ప్రేమ పథికుడు. ఎవరు ప్రేమగా కలిస్తే వారివాడయిపోతాడు. దేవ్ ఆనంద్ ఇమేజ్ని స్థిరపరచేందుకు అతడు ప్రయాణం చేస్తున్న వాహనం ఓ కారుతో ఢీ కొనబోయి ఆగినట్టు, కారులో వాళ్లు తిడుతుంటే, కారులోని అమ్మాయివైపు చూస్తూ పాట ఆరంభించేట్టు సన్నివేశాన్ని రూపొందించాడు దర్శకుడు.

దర్ద్ భీ హమే కుబూల్, చైన్ భీ హమే కుబూల్

హన్ నెహర్ తరహ్ కె ఫూల్ హార్ మే పిరోలియే.

బాధ ఆయినా స్వీకృతమే. సుఖమైనా స్వీకృతమే. అన్ని రకాల పూలను హారంగా మలచుకున్నాడు. వివరణ అవసరంలేదు. స్థితప్రజ్ఞతకు చక్కని నిర్వచనం.

దూప్ థీ నసీబ్ మే తొ ధూప్ మేలియా హై దం.

చాంద్ నీ మిలీతో హం చాంద్ నీ మె సోలియే.

మొదటి చరణంలోని భావమే ఉదాహరణతో చెప్తున్నాడు. అదృష్టంలో ఎండవేడి ఉంటే అందులోనే జీవిస్తాడు. వెన్నెల లభిస్తే వెన్నలలోనే నిద్రిస్తాడు. ఏది లభిస్తే దాన్ని అంతే ఆనందంగా స్వీకరిస్తాడన్నమాట.

దిల్ పె ఆసరా కియే హం తొ బస్ యుహీ జియే

ఏక కదం పె హస్ లియే, ఎక్ కదం పె రోలియే

హృదయం మీద భారం వేసి ఇలాగే జీవిస్తున్నాడట. ఒక అడుగులో నవ్వితే, మరో అడుగులో దుఃఖిస్తూ జీవితాన్ని సాగిస్తున్నాడట. అంటే అదృష్టం ఏమిస్తే దాన్ని హాయిగా స్వీకరిస్తున్నాడట. ఎండలో ఎండుతాడు. వానలో తడుస్తాడు. చలికి వణుకుతాడు. మొదటి రెండు చరణాల భావం మరింత స్పష్టంగా, మరో రకంగా వివరించాడు.

రాహ మే పడే హై హం కబ్‌సె ఆప్ కీ కసం

దేఖియేతొ కం సె కం, బోలియే న బోలియే.

ఇక్కడ దేవ్ ఆనంద్ ఇమేజ్‌కి వచ్చాడు. నీకోసం ఎప్పటినుంచో దారిలో కాపు కాసి ఉన్నాను. మాట్లాడకపోయినా ఫరవాలేదు. కనీసం చూడనయినా చూడు అంటున్నాడు హీరో.

ఇలా ప్రయాణపు పాటలలో కాస్త రొమాన్స్, కాస్త వ్యక్తిత్వ వికాసం, కాస్త తత్వం, కాస్త చమత్కారం కలిపి పాటను వినటం ఒక మరుపురాని అనుభవంలా ఆనందం, ఆలోచన కలిగించి అలరించే రీతిలో రూపొందించేవారు. ఇవి వింటూంటే వ్యక్తిత్వ వికాస పాఠాలు, రొమాన్స్ పాఠాలు వచ్చేస్తాయి.

మాములు ప్రయాణపు పాటలకు భిన్నంగా ఆనంద్ బక్షీ 'జీనేకీ రాహ' సినిమాలో గమ్మత్తయిన పాటను సృజించాడు.

ఆనే సె ఉస్ కే ఆయే బహార్

జానేసె ఉస్ కే జా యే బహార్

బడి మస్తానీ హై, మేరీ మహబూబా.

ప్రయాణం చేస్తూ, గమ్యం చేరుకునేలోగా నాయకుడు ప్రకృతిని చూసి పరవశిస్తూ తన ప్రేయసిని గురించి పాడుకుంటున్నాడు. ఆమె రావటంతోటే వసంతం వస్తుందట. ఆమె పోవటంతోటే వసంతం పోతుందట. మస్తానీ అంటే తనలో తాను సంతృప్తిగా ఉంటూ అన్నిటికీ ఆనందించేది అని అర్థం. అలాంటిదన్నమాట అతని ప్రేయసి.

గున్ గునాయె ఐసే జైసె బజ్ తీ హై ఘుంగ్రూ కహీపే

ఆకె పర్వతోంసె జైసె గిర్తాహై ఝుర్ నా జమీన్ పే

ఝూర్ నోంకి మౌజ్ హై వో, మౌజోంకి రవానీ హై

మేరీ మహబూబా...

'మేరీ మహబూబా' ఇక్కడ ఆకర్షణీయమైన పదం. ఆమె పాటపాడితే ఎక్కడో గజ్జెలు ఘల్లుమన్నట్టుంటుందట. 'గజ్జె ఘల్లు మంటూంటే, గుండె ఝల్లుమంటుంది, గుండె ఝల్లు మంటుంటే కవిత వెల్లువవుతుంది'. ఇది ఆమె పాట ప్రభావం. ఆమె పాట పర్వతాలనుంచి దూకే జలపాతంలాంటిదన్నమాట. అంతేకాదు. ఆమె నదీ ప్రవాహంలోని అలల్లాంటిది, అలల వేగంలాంటిది. అలాంటిది అతని ప్రేయసి అందమైన ప్రకృతి వర్ణనకు రొమాంటిక్ భావనను ముడిపెట్టి ప్రకృతికీ పడతికి ముడిపెట్టి రచించిన అందమైన శృంగార గీతం ఇది.

బన్ సవర్ కె నిల్ లే ఆయ సావన్ క జబ్ జబ్ మహీనా
హర్ కొయీ యె సం ఝె, హోగి వో కోయి చంచల్ హసీనా
పూఛోతో కౌన్ హై వో, ఋత్ యే సుహానీ హై
మేరీ మహబూబ.

ఇదీ పాటలోని చమత్కారం.

వర్ష ఋతువు వచ్చిందంటే అందంగా అలంకరించుకుని, తయారై వస్తుందట. అందరూ ఆమెని ఒక అందమైన అమ్మాయి అనుకుంటారట. కానీ ఆమె ఎవరంటే అందమైన ఋతువు అట. అద్భుతం! 'వో కోయి చంచల్ హసీనా' అన్నప్పుడు రఫీ గొంతులోని చిలిపితనం, 'ఋత్ యే సుహానీ హై ' అన్నప్పుడు కలిగే అద్భుతమైన ఆనందం పాటను వినటం, అనుభవించటం ఒక మరుపురాని దివ్యానందాన్ని మిగులుస్తుంది. ఇప్పుడు పాటను మళ్ళీ మొదటినుంచీ విని అనుభవిస్తే గేయరచయిత చమత్కారం తెలుస్తుంది. మొదటినుంచీ అతడు ప్రకృతిని వర్ణిస్తున్నాడు. అతడి ప్రేయసి ప్రకృతి. మామూలు సందర్భంలోని పాటను అసాధారణమైన ఎత్తులకు తీసుకు వెళ్లటం ఈ పాటను రూపొందించిన విధానంలో తెలుస్తుంది.

సంగీత దర్శకుల జంట లక్ష్మీకాంత్ – ప్యారేలాల్ పాట నడుమ పలు ప్రకృతి శబ్దాలను అత్యంత సమర్థవంతంగా జొప్పించటంతో పాటతో పాటు మనమూ ప్రకృతితో ప్రయాణిస్తాము. ముఖ్యంగా పిట్టలు పాడుతూ పాట ఇంటర్లూడ్ సంగీతాన్ని ముందుకు పరిగెత్తించిన విధానం గుండెను సంతోషపు దారుల్లో విశృంఖలంగా నర్తింపచేస్తుంది. మన కళాకారుల ప్రతిభకు హృదయం ఉప్పొంగుతుంది.

ఇలాంటి ప్రయాణపు పాటల్లో పలు వినూత్నమైన పోకడులు పోయాయి మన పాటలు. 'నన్హా మున్నా రాహీహు' అంటూ చిన్నపిల్లవాడు దేశభక్తి గీతం పాడితే పిల్లలను విహారయాత్రకు తీసుకువెళ్లి 'ఆవో బచ్చో తుమ్హే దిఖాయే ఝుంకీ హిందుస్తాన్‌కీ ' అంటూ దేశం గొప్పతనాన్ని వివరించే పాట ఉంది. 'అకేలా హూ మై ' అని తన ఒంటరితనాన్ని గూర్చి పాడితే 'హై అప్నా దిల్ తో ఆవారా' అంటూ తన ప్రేమ లాలసను ప్రదర్శిస్తూ పాడతాడో హీరో. ఇలా ఒకటా, రెండా పలు అద్భుతమైన గీతాలు సృజించారు మన కళాకారులు. ఆనాటి నుంచి ఈనాటి వరకూ అనేక రకాల పాటలు అదృశ్యమైపోయాయి కానీ ప్రయాణపు పాటలు అదృశ్యం కాలేదు. ఎందుకంటే ప్రయాణం అంటేనే పాట కదా! గాలి వదనానికి తాకగానే హృదయం గీతం పాడుతుంది. పాట పెదవులపై కి హృదయలోతుల్లోంచి ఉబికి ఉబికి వస్తుంది.

దిల్ చాహ్తా హై 'కభీ న బీతే చంకీలే దిన్' అంటూ కొందరు పాడితే 'యూహి చలాచల్ రాహి' అంటారింకొందరు. 'ఖాబోంకే పరిందే'ను కొందరు వెతికితే 'హం జో చచల్నేలగే' అని జంటతో ప్రయాణాన్ని వర్ణిస్తారింకొందరు. 'ఛోడ్ ఆయే హంవోగలియా' అని వదిలి వచ్చిన జ్ఞాపకాలను తలచుకుంటే, ఇంకొందరు 'ఓ గుజారియా' అంటూ నృత్యం చేస్తారు.

(మరిన్ని పాటలు వచ్చే నెలలో)

Post your comments